క్లుప్తంగా

ముక్కంటి సేవలో ప్రముఖులు



సంగీత దర్శకుడు కోటికి జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సోమశేఖర్, యాంకర్ అనసూయ,సినీ సంగీత దర్శకుడు కోటి దర్శించుకున్నారు దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధిలో పూర్వ విద్యార్థులే కీలకం

శ్రీకాళహస్తి: కళాశాల అభివృద్ధిలో పూర్వవిద్యార్థుల పాత్ర ముఖ్యమని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీలత అన్నారు. శుక్రవారం వికసిత్ భారత్ 2047 కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులతో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్రాంత ప్రిన్సిపల్స్ సుకుమార్‌రెడ్డి, రాధయ్య ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ సుస్థిర సుపరిపాలన ద్వారా దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. దాన్ని సాధించేందుకు క్రమశిక్షణతో అవినీతి రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. అధ్యాపకులు బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం..ఆంధ్రకు ఏర్పాట్లు



మైదానాన్ని చదును చేయిస్తున్న పీఈటీలు

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీల కోసం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. మైదానంలోని చెట్లు, పుట్టలను పీఈటీలు మస్తాన్, హరిబాబు తొలగించి చదును చేయించారు. వారు మాట్లాడుతూ ఆడుదాం ..ఆంధ్రా కార్యక్రమాన్ని 43 రోజుల పాటు 5 స్థాయిల్లో నిర్వహించనున్నారని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తామని, 15 ఏళ్లు నిండిన పోటీల్లో పాల్గొనవచ్చని వారు తెలిపారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



పదార్థాల రుచి చూస్తున్న ఎంపీడీఓ సాయిలహరి

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని ఎంపీడీఓ సాయిలహరి తెలిపారు. ఆమె శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. పదార్థాల రుచి చూశారు. ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు.

డ్రోన్‌తో పిచికారీపై అవగాహన



సత్యవేడు: మండల కేంద్రంలో రైతులకు ఎంపీడీఓ చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో మురళి డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. వరి, వేరుశెనగ, ఉద్యానపంటలు, మిరప చేలకు డ్రోన్ ద్వారా ఎకరాకు ఐదు నిమిషాల వ్యవధిలో పురుగు మందులు పిచికారీ చేయవచ్చన్నారు. డ్రోన్ వినియోగం ద్వారా సమయం, నగదు ఆదా అవుతుందని తెలిపారు. డ్రోన్‌లను ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తోందని, ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం అక్రమ రవాణా వాహనం జప్తు

శ్రీకాళహస్తి: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ శ్రీకాళహస్తి సెబ్ అధికారులకు పట్టుబడ్డ ఓ వాహనాన్ని శుక్రవారం ఆ శాఖ అధికారులు జప్తు చేశారు. శ్రీకాళహస్తి సెబ్ సీఐ శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. 2021 నవంబరు 10న శ్రీకాళహస్తి–పిచ్చాటూరు మార్గం బైరాజులకండ్రిగ వద్ద కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న హుండాయ్ శాంట్రో కారును శ్రీకాళహస్తి సెబ్ అధికారులు పట్టుకున్నారు. కారు యజమాని ఇచ్చిన గడువులోగా సరైనా ఆధారాలు చూపకపోవడంతో జప్తు చేశారు.

ప్రతిభ విరిసె..ఆవిష్కరణలు మెరిసె

సృజన మెరిసింది..వినూత్న ఆలోచనలకు ఆచరణ తోడైంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శన వేదికైంది. వివిధ సామాజిక సమస్యలకు పరిష్కారం చూపుతూ తక్కువ ఖర్చుతో సృజనాత్మకతతో రూపొందించిన వివిధ ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. చిట్టిబుర్రల మనసులో మెదిలిన ఆలోచనలకు అద్దం పట్టేలా రూపొందిన నమూనాలు శ్రీకాళహస్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో శుక్రవారం అబ్బురపరిచాయి.



నమూనా ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2023 జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన డీఈఓ డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. జిల్లాలోని మొత్తం 34 మండలాల నుంచి వ్యక్తిగత, గ్రూప్, టీచర్స్ విభాగంలో మొత్తం 102 నమూనాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, జిల్లా సైన్స్ ఆధికారి భానుప్రసాద్, సైన్స్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యశర్మ, ఉపాధ్యాయులు. విజేతలైన 9మంది వైఎస్ఆర్ జిల్లా కడపలో జరగనున్న ప్రదర్శనలకు హాజరు కానున్నారు.

వ్యక్తిగత విభాగంలో విజేతలు

పీబీ గణేష్(నారాయణవనం), జి.పార్థు రిత్విక్(ఓజిలి మండలం చిలమంచూరు), జె.సింధు(చిల్లకూరు మండలం బుదనం) మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

గ్రూప్ విభాగంలో

ఎం.శ్రావ్య, ఎస్‌వర్షిత, శ్రీధరమల్లి(చిన్నంబట్టు), కె.నిర్విష్ణ, పావని(శ్రీధనమల్లి),తన్విక, మౌనిక (ఆరిమానుపాడు) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

ఉపాధ్యాయుల విభాగంలో

నరసింగాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.కోదండపాణి, వరదయ్యపాళెంకు చెందిన కె.మేఘనాథ్, చిలమంచూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జె.శ్రీనివాసులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

స్మార్ట్ బ్లైండ్ స్టిక్

ఉపాధ్యాయుల విభాగంలో ద్వితీయస్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైన కె.మేఘనాథ్ రూపొందించిన స్మార్ట్ బ్లైండ్ స్టిక్ ఆకట్టుకుంది. ఈ స్మార్ట్ బ్లైండ్ స్టిక్‌ను ఉపయోగించుకుని దివ్యాంగులు ఇతరుల సాయం లేకుండా నడిచేందుకు వీలవుతుంది. ఈ స్మార్ట్‌స్టిక్‌లో కోడింగ్ ఎలా చేయాలి, సులభంగా సర్క్యూట్‌ను ఎలా కలపాలనే విషయాలను చక్కగా వివరించారు. కేవలం రూ.వెయ్యితో ఈ స్టిక్‌ను ఉపయోగించుకుని దివ్యాంగులు సులభంగా నడవచ్చు. దీంతో పాటు స్మార్ట్‌షూ, స్మాటర్ బెల్ట్, స్మార్ట్ హాట్, స్మార్ట్ స్పెక్టికల్స్‌ను కూడా చక్కగా వివరించారు.



వర్మీవాష్



తక్కువ ఖర్చుతో ఏడాది పాటు పిచికారీ చేసే నమూన 'వర్మీ వాష్' ఆలోచింపజేసింది. దొరవారి సత్రం మండలం శ్రీధనమల్లి చెందిన విద్యార్థులు ఈ నమూనాను ప్రదర్శించారు. సాధారణంగా అందరూ వర్మీకంపోస్టు వాడుతారు. అలా కాకుండా ఎండిన పేడ, రాళ్లు, వరిగడ్డి, వానపాముల ఉపయోగించి దీన్ని తయారు చేయవచ్చు. ఇందుకు అయ్యే మొత్తం కేవలం రూ.1,200. దీంతో సంవత్సరం మొత్తం వర్మీవాష్‌ను ఉపయోగించవచ్చు. మొక్కల పూత, పిందెల సమయాల్లో పిచికారీ చేస్తే మంచి ఎరువుగా మారి అధిక దిగుబడి వస్తుంది.. కృత్రిమ ఎరువుల వలన కలిగే అనర్థాల నుంచి తప్పించవచ్చని నిరూపించారు.

వర్చువల్ బ్రేకింగ్ సిస్టమ్



ప్రమాదాల నివారణకు చంద్రగిరి మండలం నరసింగాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజిల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్.కోదండపాణి రూపొందించిన వాహనాలకు అమర్చే వర్చువల్ బ్రేకింగ్ సిస్టం ప్రదర్శన అధికారులతో పాటు న్యాయనిర్ణేతల ను అబ్బుర పరిచింది. దీనికి ఉపాధ్యాయ కేటగిరిలో మొదటి బహుమతి లభించింది. వేగంగా వెళ్లే వాహనాలకు ట్రాన్స్ ఫాండర్స్ అమర్చి పట్టణాల్లోకి, నగరాల్లోకి ప్రవేశించే ముందు డ్రైవర్ ప్రమేయం లేకుండా ఆటోమేటిక్‌గా వేగాన్ని నియంత్రణ చేసే అధునాతన టెక్నాలజీని ఇందులో ఉపయోగించారు. అదే విధంగా పాఠశాలలు, ఆస్పత్రులు తదితర రద్దీ ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో కూడా వర్చువల్‌గా వాహనాల వేగాన్ని నియంత్రణ చేయవచ్చు. ఈ చిన్న పరికరాన్ని అన్ని వాహనాల్లో అమర్చుకోవడం ద్వారా ప్రమాదాలను అరికట్టి ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చు.

శాస్త్రోక్తంగా మహా సంప్రోక్షణ



సంప్రోక్షణ పూజలు చేస్తున్న వేద పండితులు

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తుల నూతన విగ్రహాలకు మహాసంప్రోక్షణ పూజలు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వేలా సుందరం దంపతులు, గ్రామస్తుల సమక్షంలో ఆలయ వేద పండితులు మధుస్వామి, మోహనాచార్యులు, నిరంజనాచార్యుల ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఉత్సవాల సమయంలో గ్రామోత్సవం కోసం ఉత్సవ విగ్రహాలు కావాలని ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ విన్నవించారు. స్పందించిన ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా 50శాతం రాయితీపై ఉత్సవ విగ్రహాలను అందేలా కృషి చేశారని కమిటీ సభ్యులు తెలిపారు. సభ్యులు దోనిపర్తి రమేష్, చిన్నా, బొప్పన మోహనమురళి, పన్నెం నిర్మల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల ధ్వంసం కేసుపై విచారణ



కేవీబీపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటోతో ఉన్న లైటింగ్‌బోర్డులు, బ్యానర్లను ధ్వంసం చేసిన కేసుపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. వివరాలు.. మండలంలోని ఓళ్లూరు గ్రామంలో మానమ్మకం నువ్వే జగన్ బ్యానర్లతో పాటు వైఎస్సార్‌సీపీ జెండాను అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత గోగుల బాబు, మరో ఇద్దరితో కలిసి ధ్వంశం చేశారు. స్థానిక టీడీపీ సర్పంచ్ ఆధ్వర్యంలోనే ఈపని చేశారని గ్రామస్తులు మండిపడ్డారు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ సునీల్‌కుమార్ స్పందించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

డిజిటల్ పద్ధతిలో ఇంటి పన్ను వసూలు

వరదయ్యపాళెం: ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గ్రామ పంచాయతీల్లో డిజిటల్ పద్ధతిలో నగదు రహితంగా ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. శుక్రవారం వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో నగదు రహితంగా పేటీఎం ద్వారా ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి రసీదులు అందజేశారు. ముందుగానే పంచాయతీ కార్యదర్శులు నగదురహిత చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో, డిజిటల్ విధానంలో చెల్లించేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు. ఈ పద్ధతి సులభతరంగా ఉందని ప్రజలు సైతం చెబుతున్నారు.



పేటీఎం ద్వారా పన్ను చెల్లిస్తున్న స్థానికులు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సత్యవేడు: పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. శాంతాక్లాస్ వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ కె.చంద్రశేఖర్, ఎంఈఓ కె.రవి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, త్యాగానికి చిహ్నమని అన్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ దండపాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌ఫాంట్ జీసెస్ స్కూల్లో



రేణిగుంట: రేణిగుంట పాతచెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న ఇన్‌ఫాంట్ జీసెస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ సంబరాలు జరిగాయి. ప్రిన్సిపల్ సైమన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో చర్చి ఫాదర్ సునైనాథన్ మైకేల్ పాల్గొని క్రిస్మస్ విశిష్టత, ఏసుప్రభువు జీవిత చరిత్రను వివరించారు. విద్యార్థులు వివిధ వేషధారణల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆల్ఫ్రెడ్ ప్రేమ్‌చంద్, గిరిబాబు, ట్రిస్సామేరీ, బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : జనరంజకమైన పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ముచ్చివోలులో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాలతో రాష్ట్రంలో ప్రతికుటుంబానికి లబ్ధి చేకూరినట్లు పేర్కొన్నారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సుపరిపాలన కొనసాగుతుందని తెలిపారు. ప్రతిఒక్కరు వైఎస్సార్ సీపీని బలపరచాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ జండాను ఆవిష్కరించారు. నాయకులు శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, గురునాథంరెడ్డి, మాధవరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంట: పథకాల వివరాల బోర్డును ఆవిష్కరణ

నవరత్నాలు కొనసాగాలంటే జగనన్నే రావాలి

రేణిగుంట: రాష్ట్రంలో నవరత్న పథకాలు కొనసాగాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆర్.మల్లవరం సర్పంచ్ ఆవుల మునివెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని ఆర్.మల్లవరం సచివాలయంలో శుక్రవారం సాయంత్రం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను, నాలుగన్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, అందిన నవరత్న ఫలాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో లేవని, అయితే ప్రతిపక్షాలు నిత్యం విషం చిమ్ముతూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. ఈవోపీఆర్‌డీ వెంకటరత్నమ్మ, కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు



నారాయణవనం : ఆలయం వద్ద ఏర్పాట్లు

నారాయణవనం: వైకుంఠ ఏకాదశి వేడుకలకు మండల కేంద్రంలోని టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయంలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టినట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ శనివారం వేకువ జామున తిరుప్పావైతో ఆలయాన్ని తెరచి ధనుర్మాస పూజల అనంతరం భక్తులను ఆరు గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామన్నారు. సాయంత్రం ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న గ్రామోత్సవాన్ని నిర్వస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయంలో ద్వాదశి ద్వారోత్సవంలో భాగంగా ఉదయం 8 గంటలకు అంతర ప్రాకారంలోని ఉత్తరముఖ ద్వారంలో ఉత్సవ మూర్తులు ప్రవేశిస్తారని, భక్తుల దర్శనార్థం 12.30 గంటల వరకు భక్తులు ద్వాదశి ద్వార ప్రవేశం చేయవచ్చని పేర్కొన్నారు.



ముస్తాబైన ఉత్తర ముఖ ద్వార మార్గం

వరదరాజస్వామి ఆలయంలో సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధం అయినట్లు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన ఆలయంలో వైకుంఠ ఏకాదశి పనులను పర్యవేక్షించారు. వేకువ జామునే వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. పెద్ద సంఖ్యలో విచ్చేసే భక్తులను దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఉచిత ప్రసాద పంపిణీ కూడా ఉంటుందని తెలిపారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి: సూచనలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

విద్యారంగంలో సాంకేతిక విప్లవం



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న సుమన్‌కుమార్

బుచ్చినాయుడుకండ్రిగ: కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యా బోధన అందించాలన్న సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేస్తుందని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకన్నా బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు అరణివిద్యానాథరెడ్డి, ఎంపీపీ సుబ్బరత్నమ్మ, ఎంపీడీఓ సాయిలహరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయుడు, ఉపసర్పంచ్ మునిరాజా, ఎంఈఓ రవీంద్రనాథ్, నాయకులు అజయ్‌కుమార్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హెచ్ఎం రమణయ్య పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి విచ్చేశారు. సుమన్‌కుమార్ మాట్లాడుతూ విద్యతోనే కుటుంబ ఉన్నతి సాధ్యమని ఆ రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. మండలంలో 8వ తరగతి చదువుతున్న 348 విద్యార్థులకు తొలి విడతగా 170 మందికి ట్యాబ్‌లను పంపిణీ చేశారు.వైస్ ఎంపీపీ శివశంకర్, ఏవో గుణశేఖర్, కో ఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, సర్పంచ్‌లు ధర్మలింగం, గుణశేఖర్, పార్టీ నాయకులు ఏకాంబరం, చిన్నదొరై, సొరకాయలు, మోహన్, శరవణ, చీరాలయ్య, ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, గోవిందస్వామి, హెచ్ఎంలు పాల్గొన్నారు.



నారాయణవనం : ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు

రక్తహీనతను అధిగమిద్దాం



గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు చేయిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ప్రాణాలను బలిగొంటున్న రక్తహీనత సమస్యను అధిగమించేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్విరామంగా కృషి చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రౌతుసూరమాల సచివాలయాన్ని టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. బృంద సభ్యులు సచివాలయ పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, ఏడాదిలోపు వయస్సు కలిగిన చిన్నపిల్లల వివరాలు సేకరించి, వారికి హెచ్‌బీ పరీక్షలు చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో రక్తహీనతతో బాధపడేవారికి పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఇందులో భాగంగా ఏడాదిలోపు పిల్లలకు ఇమ్యూనైజేషన్‌లో క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు నాగేంద్ర కుమార్, బేబిరాణి, ప్రకాష్, పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిపూజ, పీహెచ్ఎన్ సంపూర్ణ, పీహెచ్‌వో రత్నాకర్, ధనమ్మ, పద్మావతి, విజయమ్మ, నాగరాజమ్మ, ఆశా కార్యకర్తలు నాగభూషణమ్మ, సుగుణ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు పట్టణానికి చెందిన జూలుగంటి మురళి దంపతులు రూ.40వేలు విలువ చేసే సౌండ్ సిస్టంను వితరణగా అందజేశారు. వారిని పాఠశాల తరపున ఘనంగా సన్మానించారు. జూలుగంటి మురళి మాట్లాడుతూ భవిష్యత్తులో పాఠశాలకు అనేక విధాలుగా సహకారం అందిస్తామన్నారు. హెచ్ఎంచంద్రబాబు, ఉపాధ్యాయులు గోపాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



సౌండ్ సిస్టంను అందజేస్తున్న మురళి

జాబితా పారదర్శకంగా ఉండాలి

శ్రీకాళహస్తి: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. శుక్రవారం వారు ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు, నాయకులు మద్దు వాసు యాదవ్, కన్నా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా నేషనల్ మ్యాథమెటిక్స్‌డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శ్రీలత మాట్లాడుతూ గణితం ప్రాముఖ్యతను, శ్రీనివాసరామానుజం గణిత శాస్త్రానికి చేసిన సేవలను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మురళి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీ శ్రీచైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్ రూపాదేవి ఆధ్వర్యంలో మ్యాథ్స్ ఎక్స్‌పో, సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. అదే విధంగా జయరామరావువీధి శ్రీచైతన్య పాఠశాలలో కూడా గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ గంగారాం, ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, అకడమిక్ ఇన్‌చార్జి వెంకటేశులు, ఉపాధ్యాయులు మాధవీలత, గౌరి, శివ, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు.

కల్లివెట్టు పాఠశాలలో

బుచ్చినాయుడుకండ్రిగ: కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మ్యాథమేటిక్స్‌డే నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ మన నిత్య జీవితానికి గణితంతో ముడిపడి ఉందని, రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలన్నాలని తెలిపారు. రూపేష్‌కుమార్, గణిత ఉపాధ్యాయులు సురేష్‌బాబు, దేవేంద్ర, ఉపాధ్యాయులు యువశ్రీమురళి, వేణుగోపాల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాల సమావేశంలో పాల్గొన్న అధ్యాపకులు

రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

సత్యవేడు: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపల్ కె.లత అన్నారు. శుక్రవారం శ్రీనివాస రామనుజం జయంతి సందర్భంగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గణిత మేళా నిర్వహించారు. మ్యాథ్స్ ఉపాధ్యాయుడు డీవిరాజు మాట్లాడుతూ మాథ్స్ గొప్పతనాన్ని, రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. విద్యార్థులకు గణిత పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.







శ్రీకాళహస్తి శ్రీచైతన్య పాఠశాలలో ..., బీఎన్‌కండ్రిగ: శ్రీనివాస రామానుజన్‌కు నివాళులు, సత్యవేడు: ప్రదర్శనలు తిలకిస్తున్న ప్రిన్సిపల్